దిన పత్రిక
తొలి సమయం
ఆదివారం । 26 । జూలై । 2026

# బిఆర్ఎస్ పార్టీ ఉద్యమ నాయకుడు గోపాల్ నాయక్‌కి ఘన నివాళులర్పించిన నిరంజన్ రెడ్డి





**తొలి సమయం, వనపర్తి జులై 25**

వనపర్తి పట్టణం11,వ వార్డు నాగవరం తండాకు చెందిన బిఆర్ఎస్ పార్టీ ఉద్యమ నాయకులు గోపాల్ నాయక్ గారు నేడు అనారోగ్య కారణాలతో మరణించిన విషయం తెలుసుకున్న మాజీ మంత్రివర్యులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి వారి నివాసానికి వెళ్లి భౌతికకాయానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. గోపాల్ నాయక్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని కుటుంబ సభ్యులకు భగవంతుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో,స్థానిక కౌన్సిలర్ స్వాతి హరిబాబు రఘు బ్రదర్స్, వెంకటేష్ గౌడ్ రవికుమార్ సుధాకర్ జగన్ నాయక్ రామదాసు రాజు యాదగిరి, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.

# నీతి ఆయోగ్ డైరెక్టర్‌నంటూ రూ.1.85 లక్షల మోసం

**- ఎస్టీ కార్పొరేషన్ లోన్లు ఇప్పిస్తానని నమ్మించి నగదు వసూలు.. నిందితుడి అరెస్ట్**




**తొలి సమయం మహబూబాబాద్ 25 జూలై 2026**

ప్రభుత్వ పథకాల పేరుతో ప్రజలను మోసం చేస్తున్న వ్యక్తిని మహబూబాబాద్ టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. తాను నీతి ఆయోగ్ డైరెక్టర్‌నని పరిచయం చేసుకుంటూ, కార్పొరేషన్ ద్వారా రుణాలు మంజూరు చేయిస్తానని పలువురిని నమ్మించి వారి వద్ద నుంచి సుమారు రూ.1,85,000 నగదు వసూలు చేసినట్లు పోలీసులు తెలిపారు.మహబూబాబాద్ టౌన్ ఇన్స్పెక్టర్ రఘుపతి రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గూడూరు మండలం చెర్ల తండాకు చెందిన బోడ మహేష్ (36), తాను నీతి ఆయోగ్ డైరెక్టర్‌నని చెప్పుకుంటూ ప్రభుత్వ పథకాల ద్వారా రుణాలు, ముఖ్యంగా కార్పొరేషన్ లోన్లు మంజూరు చేయిస్తానని పలువురిని నమ్మించాడు. ఈ క్రమంలో బాధితుల నుంచి నగదు వసూలు చేసి మోసానికి పాల్పడ్డాడు.బాధితుల ఫిర్యాదు మేరకు మహబూబాబాద్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విచారణలో నిందితుడిని గుర్తించి అరెస్ట్ చేసినట్లు ఇన్స్పెక్టర్ రఘుపతి రెడ్డి వెల్లడించారు. మోసగాళ్లను నమ్మొద్దుప్రభుత్వ రుణాలు, సబ్సిడీలు, ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి డబ్బులు అడిగే వ్యక్తులను ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దని టౌన్ ఇన్స్పెక్టర్ రఘుపతి రెడ్డి సూచించారు. ప్రభుత్వ పథకాలకు సంబంధించిన వివరాలు, దరఖాస్తులు, రుణాల కోసం సంబంధిత ప్రభుత్వ కార్యాలయాలను మాత్రమే సంప్రదించాలని కోరారు. ఎవరైనా ప్రభుత్వ పథకాల పేరుతో డబ్బులు వసూలు చేస్తూ మోసానికి పాల్పడితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు

# ఏకలవ్య పాఠశాలలో సమస్యలు పరిష్కరించాలి

**- మంచినీరు, యూనిఫాంలు, మౌలిక వసతులు కల్పించాలి: పీడీఎస్‌యూ**



**తొలి సమయం కొత్తగూడ కొత్తగూడ,25 జూలై 2026**

కొత్తగూడ మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని పీడీఎస్‌యూ మండల అధ్యక్షుడు బానోత్ విష్ణు డిమాండ్ చేశారు. శుక్రవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నాయకులు పాఠశాలను సందర్శించి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించారు.ఈ సందర్భంగా బానోత్ విష్ణు మాట్లాడుతూ.. పాఠశాలలో ఇప్పటివరకు విద్యార్థులకు సరైన మంచినీటి సౌకర్యం కల్పించకపోవడం ఆందోళనకరమని, వెంటనే తాగునీటి వసతి ఏర్పాటు చేయాలని కోరారు. విద్యార్థులకు ఇప్పటివరకు యూనిఫాంలు, టైలు, బెల్టులు అందలేదని, ప్రభుత్వం వెంటనే వాటిని అందజేయాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న బ్రేక్‌ఫాస్ట్, మిల్క్ పథకాలను అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తగినన్ని మరుగుదొడ్లు నిర్మించడంతో పాటు అదనపు తరగతి గదులను ఏర్పాటు చేయాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను మెరుగుపరచాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ నిధులను తక్షణమే విడుదల చేయాలని, మండలానికి ఒక రెగ్యులర్ ఎంఈఓను నియమించాలని కోరారు. ప్రతి పాఠశాలకు ఒక రెగ్యులర్ స్కావెంజర్‌ను నియమించి విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని డిమాండ్ చేశారు.విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని బానోత్ విష్ణు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు దిలీప్ కుమార్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు

# బీరప్ప కురుమ యువజన సంఘం యువకులకు సమ్మి గౌడ్ ఫౌండేషన్ చేయూత



**- 70 టీ షర్టులు అందజేసిన సమ్మయ్య గౌడ్**

**తొలి సమయం ప్రతినిధి; కేసముద్రం/ (మహబూబాబాద్),జూలై 26:**

తొలి ఏకాదశి పండుగ సందర్భంగా ఉప్పరపల్లి గ్రామంలోని శ్రీ బీరప్ప స్వామి దేవస్థానంలో బీరప్ప కురుమ సంఘం ఆధ్వర్యంలో బోనాల వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ఉప్పరపల్లి బీరప్ప కురుమ సంఘం అధ్యక్షులు,కమిటీ సభ్యులు సమ్మి గౌడ్ ఫౌండేషన్ అధినేత చిలువేరు సమ్మయ్య గౌడ్ కలిసి సంఘ సభ్యులకు 70 టీ-షర్ట్స్ అందించాలని కోరగా, వెంటనే సానుకూలంగా స్పందించి 70 టీ-షర్ట్స్ అందజేశారు.ఈ సందర్భంగా సమ్మయ్య గౌడ్ మాట్లాడుతూ, గ్రామాల్లో జరిగే ఆధ్యాత్మిక, సాంప్రదాయ కార్యక్రమాలకు తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని, సమాజ సేవే తన లక్ష్యమని అన్నారు.బీరప్ప కురుమ సంఘం అధ్యక్షులు, సభ్యులు మాట్లాడుతూ తమ విజ్ఞప్తిని ఆలకించి టీ-షర్ట్స్ అందించిన సమ్మయ్య గౌడ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాభివృద్ధి, ప్రజా సేవ, సామాజిక కార్యక్రమాల్లో ఆయన అందిస్తున్న సహకారం ఆదర్శనీయమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో సమ్మి గౌడ్ ఫౌండేషన్ టీం సభ్యులు మరియు గ్రామ పలుస పద్మ వెంకన్న (8వ వార్డు సభ్యులు), తండా సంపత్ (9వ వార్డు సభ్యులు), పలుస రాకేష్, ఎసల్ల సత్యనారాయణ, కొమ్మనబోయిన రంజిత్, సీలోజు విజేందర్ అలాగే బీరప్ప కురుమ సంఘం సభ్యులు యార ముత్తయ్య, కంచ కట్టయ్య, కంకల శ్రీనివాస్, కంకల బీరయ్య, కంకల సుమన్, కంచ కుమారస్వామి, కంకల ఐలయ్య, కుందే రతన్, కుందే మహేందర్, అల్లి అశోక్, కంచ ఐలయ్య, కంకల కుమారస్వామి, కంకల దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలి: డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి





**తొలి సమయం, వనపర్తి, జూలై 25**

తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు,ఎల్‌నినో నిపుణుల కమిటీ చైర్మన్ ఎల్‌నినో కారణంగా వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు రైతులు సాంప్రదాయ పంట వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలనీ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి సూచించారు.శనివారం ఉదయం వనపర్తి జిల్లా గోపాల్పేట మండలం జయన్న తిరుమలాపూర్ గ్రామంలో ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు నిర్వహించిన గ్రామసభలో ఎల్‌నినో నిపుణుల కమిటీ చైర్మన్ ,రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి మాట్లాడుతూ రైతులు పంట మార్పిడి విధానాన్ని అవాలంబిచడం ద్వారా నష్టాలను తగ్గించుకోవడంతో పాటు స్థిరమైన ఆదాయాన్ని పొందవచ్చని తెలిపారు.రైతులు వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు,సిబ్బంది సలహాలు,సూచనల మేరకు వరి పంటకు బదులుగా పప్పుధాన్యాలు, కూరగాయలు, ఇతర ఉద్యాన పంటల సాగుపై దృష్టిపెట్టాలని సూచించారు. ఇంకుడు గుంటల ద్వారా నీటిని ఒడిసిపట్టే పద్ధతుల ద్వారా వర్షపునీటినిసంరక్షించుకోవాలన్నారు. కరువు ప్రభావం ఉన్నందున ఉపాధి పనులను సంవత్సరం పొడవుగా ప్రజలకు పనిని కల్పించి ఉపాధి కల్పించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి విన్నవించామని వారు సానుకూలంగా స్పందించి వీలైతే కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి ఉపాధి హామీ పనులను కొనసాగించడానికి కృషి చేస్తానని అన్నారని తెలిపారు. ఎల్‌నినోప్రభావాన్ని తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఎల్లవేళలా అండగా ఉంటుందనిఆయనహామీ ఇచ్చారు. ప్రత్యామ్నాయ, ఆరుతడి పంటల సాగు, నీటి పొదుపు సరైన విధానాలు పాటించి ఎల్‌నినోను ఎదుర్కోవచ్చని అన్నారు. కలెక్టర్ ఆదర్శ్ సురభి గారు మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో ప్రతి నీటి బొట్టు అత్యంత విలువైనది కాబట్టి సంబంధిత అధికారులు ప్రజలకు నీటి అవసరం పై అవగాహన పెంచాలని సూచించారు.ఇంకుడు గుంతలు, భూగర్భ జలాల పరిరక్షణ ప్రజా ఉద్యమంగా మార్చి నీటి వనరులను పెంచాలని అన్నారు.వరికి బదులు చిరుధాన్యాలు, పప్పు ధాన్యాలు నూనె గింజల పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. ఎల్‌నినో ప్రభావం తగ్గించడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని, ప్రజలకు ఏ సమాచారం కావాలన్నా జిల్లా అధికారులు అందుబాటులో ఉంటారు కాబట్టి వారి సేవలను వినియోగించుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారులు, మండల అధికారులు, గ్రామ పెద్దలు, రైతులు ,ప్రజలు పాల్గొన్నారు.

# వర్షాభావాన్ని అధిగమించేందుకు ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించాలి

**పంట మార్పిడితో భూసారం, దిగుబడులు, ఆదాయం పెంపు సాధ్యం: ఏఓ అబ్దుల్ మాలిక్**

**తొలి సమయం కొత్తగూడ 25 జూలై 2026**

వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలను ఎంపిక చేసుకోవాలని గూడూరు మండల వ్యవసాయ అధికారి మహమ్మద్ అబ్దుల్ మాలిక్ సూచించారు. శనివారం మండలంలోని పాటిమీద తండా గ్రామంలో వర్షాభావ పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పంటలు, పంట మార్పిడిపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఏఓ అబ్దుల్ మాలిక్ మాట్లాడుతూ.. ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో రైతులు ఒకే పంటపై ఆధారపడకుండా పరిస్థితులకు అనుగుణంగా తక్కువ నీటితో సాగు చేయగల పంటలను ఎంచుకోవాలని సూచించారు. శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను పాటించడం ద్వారా పంటల దిగుబడిని మెరుగుపరచుకోవచ్చని తెలిపారు. పంట మార్పిడి విధానాన్ని అనుసరించడం వల్ల భూసారం పరిరక్షించడంతో పాటు పంటల దిగుబడులు, రైతుల ఆదాయం పెంచుకోవచ్చని వివరించారు. వర్షాభావ పరిస్థితుల్లో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సమగ్ర పంట నిర్వహణ, ప్రభుత్వం అందిస్తున్న వ్యవసాయ శాఖ సేవలు, సూచనలను రైతులకు వివరించారు.వర్షపాతం తక్కువగా ఉన్న ప్రాంతాల్లో



పెసర్లు, కందులు, మినుములు, బొబ్బర్లు, జొన్నలు వంటి తక్కువ నీటితో సాగు చేయగల పంటలను ప్రత్యామ్నాయంగా ఎంచుకోవాలని సూచించారు. అలాగే దీర్ఘకాలికంగా రైతులకు ఆదాయాన్ని అందించే ఆయిల్‌పామ్ సాగుపై కూడా దృష్టి సారించాలని ఏఓ అబ్దుల్ మాలిక్ తెలిపారు.రైతులు వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలని, పంటల ఎంపిక నుంచి కోత వరకు శాస్త్రీయ యాజమాన్య పద్ధతులను అవలంబించాలని ఆయన కోరారు.ఈ సదస్సులో వ్యవసాయ విస్తరణ అధికారి మధు, గ్రామ సర్పంచ్ ధారావత్ రాజు, ఉప సర్పంచ్ శోభ, రైతులు, గ్రామ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# బాబాయిని కొట్టి చంపిన అబ్బాయి క్షణిక ఆవేశంలో దారుణ హత్య..



**తొలి సమయం నర్సంపేట 25 జూలై 2026**

వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం నాచినపల్లి గ్రామంలో తెల్లవారుజామున దారుణ హత్య చోటుచేసుకుంది. క్షణిక ఆవేశంలో ఓ వ్యక్తి తన స్వంత బాబాయిని కొట్టి హత్య చేసిన ఘటన స్థానికంగా కలకలం రేపింది.పోలీసుల వివరాల ప్రకారం.. నాచినపల్లికి చెందిన ముసుకుల సాంబారెడ్డి (57) శారీరక వికలాంగుడు. అదే గ్రామానికి చెందిన ఆయన అన్న కుమారుడు ముసుకుల రాజు (36)తో ఏదో విషయంలో వివాదం చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో రాజు ఆవేశానికి లోనై సాంబారెడ్డిపై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడిన ఆయన అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం.సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. నిందితుడు రాజును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. హత్యకు అసలు కారణాలు ఏమిటన్నది పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

# పలువురిని పరామర్శించిన మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి





**తొలి సమయం, వనపర్తి, జులై 25**

పెద్ద మందడి మండలం అమ్మపల్లి గ్రామ బిఆర్ఎస్ పార్టీ నాయకులు బురాన్ మాతృమూర్తి పిడుగు కొండమ్మ ఇటీవల గుండె చికిత్స చేయించుకోవడం జరిగింది. వారి నివాసానికి వెళ్లి పరామర్శించి మాజీ మంత్రి వర్యులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మరియు అదే గ్రామానికి చెందిన భాస్కర్ రెడ్డి గారి తండ్రి ఇటీవల కరెంట్ షాక్ తో మరణించడం జరిగింది ఇట్టి విషయం తెలుసుకున్న మాజీ మంత్రి వర్యులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. అలాగే గోపాల్ గారి మనవ డు ఇటీవల ప్రమాదవశాత్తు మరణించడం జరిగింది వారం దరినీ పరామర్శించిన మాజీ మంత్రివర్యులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఈ సందర్భంగా వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, మెరుగైన చికిత్సతో త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం కల్పించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రిగారి వెంట రఘుపతి రెడ్డి , శ్రీను , రఘు మరియు మండల నాయకులు అలాగే గ్రామంలో ఉన్నటువంటి నాయకులు చందు , రామేశ్వర్ రెడ్డి , వెంకటేశ్వర్ రెడ్డి , బసవరాజు గారు, బందన్న, రాకేష,భాను ప్రకాష్, కృష్ణ , మరియు తదీతరులు పాల్గొన్నారు.

# ఎన్ఐటీ తిరుచిరాపల్లిలో గూడూరు యువకుడి ఘనత

**- పీహెచ్‌డీ పట్టా సాధించిన డా. యుగేందర్ మూడ్**

**తొలి సమయం కొత్తగూడ 25 జూలై 2026**

గూడూరు మండలం గోవిందాపురం గ్రామానికి చెందిన డా. యుగేందర్ మూడ్ అరుదైన విద్యా ఘనతను సాధించారు. తమిళనాడులోని ప్రతిష్ఠాత్మక నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ) తిరుచిరాపల్లి నుంచి ఇంజినీరింగ్ విభాగంలో డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (పీహెచ్‌డీ) పట్టాను విజయవంతంగా అందుకున్నారు.గ్రామీణ ప్రాంతానికి చెందిన నిరుపేద గిరిజన (లంబాడీ) కుటుంబం నుంచి వచ్చిన యుగేందర్ పట్టుదలతో చదువును కొనసాగిస్తూ ఉన్నత విద్యలో ఈ స్థాయికి చేరుకోవడం అభినందనీయమని నవతెలంగాణ విద్యార్థి సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు బానోత్ రామన్న నాయక్ అన్నారు. ఈ సందర్భంగా డా. యుగేందర్‌ను ఆయన అభినందించారు.యుగేందర్ సాధించిన ఈ విజయం మహబూబాబాద్ జిల్లాతో పాటు గూడూరు మండల యువతకు స్ఫూర్తిదాయకమని రామన్న నాయక్ పేర్కొన్నారు. గ్రామీణ,



గిరిజన ప్రాంతాల విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి చదివితే జాతీయ స్థాయిలో రాణించవచ్చని ఆయన అన్నారు.ఈ సందర్భంగా డా. యుగేందర్ మూడ్ మాట్లాడుతూ, తన విజయానికి భగవంతుడి కృపతో పాటు పరి శోధన మార్గదర్శకులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు, శ్రేయో భిలాషుల ప్రోత్సాహం, సహకారం ప్రధాన కారణమని తెలి పారు. తనపై నమ్మకం ఉంచి ప్రతి దశలో ప్రోత్సహించిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.భవిష్యత్తులో బోధన, పరిశోధన, ఆవిష్కరణల రంగాల్లో మరింత కృషి చేస్తూ సమాజ అభివృద్ధికి తన వంతు సేవలందిస్తానని డా. యుగేందర్ మూడ్ తెలిపారు.డా. యుగేందర్ మూడ్ పీహెచ్‌డీ పట్టా సాధించడంపై గోవిందాపురం గ్రామ ప్రజలు, గూడూరు మండల వాసులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.

# వనపర్తి బిఆర్ఎస్ పార్టీలోకి కొనసాగుతున్న వలసలు





**తొలి సమయం, వనపర్తి జులై 24**

చిన్నగుంటపల్లి కాంగ్రెస్ కార్యకర్తలు బి.ఆర్.ఎస్ పార్టీలో చేరిక.కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించిన మాజీ మంత్రివర్యులు వనపర్తి మండలం చిమనగుంటపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు గౌరవ మాజీ మంత్రివర్యులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి సమక్షంలో బి.ఆర్.ఎస్ పార్టీలో చేరారు.పార్టీలో చేరిన వారికి గౌరవ నిరంజన్ రెడ్డి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా గౌరవ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ పాత,కొత్త వాళ్ల కలియికతో పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీలో చేరిన వారిలో కందూరు. శాంతయ్య, దండు.లక్ష్మయ్య,కందూరి.ఎల్లయ్య,చిన్న వెంకట స్వామి, దండు.రాజు, పానుగంటి రాజు,గొర్ల సతీష్,పానుగంటి గోపాల్,గొర్ల రమేష్, పానుగంటి మహేష్, గొర్ల రాజు,చరణ్, ఆర్కటం ఆంజనేయులు, గున్న చంద్రారెడ్డి, పోతురాజు బాలయ్య, మధు, పానుగంటి.రవి ఉన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్ అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్ జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్,చిట్యాల.రాము, పానుగంటి రాము, ధర్మ శాస్త్రి,భగవంతు యాదవ్, మైకెల్,పుల్లయ్య,బాలయ్య,పి.రాము,రాజేశ్వర్ రెడ్డి, శంషుద్దీన్, విష్ణు,కొమ్ము.రాము,స్వామి,జి.రాజు ఉన్నారు.

# రొంపేడు, కొమరారం పీహెచ్‌సీల్లో డాక్టర్లు, సిబ్బంది నియమించాలని సీపీఎం డిమాండ్




**తొలి సమయం, ఇల్లందు;జులై, 25:**

రొంపేడు, కొమరారం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఖాళీగా ఉన్న డాక్టర్లు, పారామెడికల్ సిబ్బంది పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, అవసరమైన మందులు సరఫరా చేసి మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం డిమాండ్ చేసింది. శనివారం నిర్వహించిన సర్వే అనంతరం సీపీఎం జిల్లా నాయకుడు అబ్దుల్ నబీ, మండల కార్యదర్శి ఆలేటి కిరణ్‌కుమార్ మాట్లాడుతూ, రెండు పీహెచ్‌సీల్లో ఇద్దరు డాక్టర్లు అవసరం ఉండగా ప్రస్తుతం డిప్యూటేషన్‌పై ఒక్కొక్కరు మాత్రమే పనిచేస్తున్నారని తెలిపారు. రోజూ 50 నుంచి 100 మంది రోగులు వైద్య సేవలు పొందుతున్న గిరిజన ప్రాంతాల్లో వైద్య సిబ్బంది కొరత తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోందన్నారు. కొమరారం పీహెచ్‌సీకి కాంపౌండ్ వాల్ నిర్మించడంతో పాటు అంబులెన్స్ సౌకర్యం, పూర్తి స్థాయి వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరారు.

# ఎడ్జెర్లలో పంట మార్పిడి విధానానికి శ్రీకారం

**- వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని**

**రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగు చేపట్టాలి**

**- జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్**



**తొలి సమయంమహబూబాబాద్/మరిపెడ జూలై 25**

మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని ఎడ్జెర్ల గ్రామంలో గిరిజన రైతు బాదావత్ వీరన్నబుజ్జి దంపతుల వ్యవసాయ పొలంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ పెసర విత్తనాలను విత్తి పంట మార్పిడి విధానాన్ని అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులతో నేరుగా మాట్లాడిన కలెక్టర్, మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయంలో మార్పులు చేసుకోవాల్సిన అవసరాన్ని వివరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ ఏడాది సూపర్ ఎల్నినో ప్రభావం కారణంగా సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని, అలాంటి పరిస్థితుల్లో రైతులు అధిక నీటి అవసరమున్న పంటల కంటే తక్కువ కాలంలో దిగుబడి ఇచ్చే, తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవడం మంచిదని సూచించారు. ముఖ్యంగా పెసర, మినుము, కందులు వంటి పప్పుధాన్యాల సాగు ద్వారా రైతులు ఖర్చు తగ్గించుకుని మెరుగైన ఆదాయం పొందే అవకాశాలు ఉన్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎస్. విజయ్ చంద్ర, జిల్లా ఉద్యానశాఖ అధికారి జై మరి అన్నా, కేవీకే మల్యాల కోఆర్డినేటర్ భాను దిలీప్ కుమార్, ప్రిన్సిపల్ సైంటిస్ట్ ప్రశాంత్ నాయక్, ఇరిగేషన్ శాఖ ఈఈ కె. లక్ష్మీరావు, తహసీల్దార్ కృష్ణవేణి, ఎంపీడీవో వేణుగోపాల్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ప్రగతి శ్రీపాల్ రెడ్డి, వైస్ చైర్మన్ సునీత రవీందర్ రెడ్డి, స్థానిక సర్పంచ్ లచ్చుతి నాయక్, గుర్రపుతండా సర్పంచ్ శరత్ నాయక్, ధర్మారం సర్పంచ్ బాబు నాయక్, ఆత్మ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పెండ్లి రఘువీర రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, శాస్త్రవేత్తలు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# కేంద్రమంత్రి రాజీనామా ప్రజా పోరాట విజయం

## బిజెపి పతనానికి నాంది: రమేష్



**తొలి సమయం, వనపర్తి, జులై 25**

నీట్ పేపర్ లీకుకు బాధ్యుడైన బిజెపి కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా సిజెపి యువత విద్యార్థుల, ప్రజల పోరాట విజయమని, బిజెపి పతనానికి నాందని సిపిఐ వనపర్తి నియోజకవర్గ కార్యదర్శి రమేష్ అభివర్ణించారు. శనివారం వనపర్తి సిపిఐ ఆఫీసులో కేంద్ర మంత్రి రాజీనామా నేపథ్యంలో ముఖ్య నేతల సమావేశంలో పరిస్థితిపై చర్చించి మాట్లాడారు. కాక్రోచ్ జనతా పార్టీ యువత విద్యార్థులు కేంద్ర మంత్రి రాజీనామా చేయాలని, ఆత్మహత్య చేసుకున్న 23 మందికి ఒక్కొక్కరికి రూ. కోటి చొప్పున నష్టపరిహారం చెల్లించాలని,ఉద్యమకారులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలన్న మూడు డిమాండ్లను కేంద్రం మెడలు వంచి సాధించటం ప్రజా పోరాటాలకు ఎంతటి వారైనా తలవంచక తప్పదని రుజువు చేసిందన్నారు. యువకులు విద్యార్థులతో పెట్టుకున్న ఏ ప్రభుత్వాలు పాలకులు మనిగడ సాగించిన చరిత్ర దేశంలో లేదన్నారు. సీజెపి పోరాటానికి సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి రాజా నేతలు స్వయంగా వెళ్లి మద్దతు తెలిపారని, ఏఐఎస్ఎఫ్ ఏఐవైఎఫ్ నాయకులు మద్దతు తెలిపి పోరాటంలో పాల్గొని గాయపడ్డారన్నారు స్వాతంత్రోద్యమం, ప్రత్యేక తెలంగాణ తొలి మలిదశ ఉద్యమం, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం తాజాగా సిజెపి పోరాటం దాన్ని గుర్తు చేసిందన్నారు. సీజెపి పై బిజెపి ఎంత దుష్ప్రచారం సాగించిన ప్రజా పోరాటం ముందు నిలబడలేదన్నారు. ఇదే స్ఫూర్తితో నరేంద్ర మోడీ గతంలో ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న హామీ, ప్రతి రైతు ఖాతాలో రూ. 15 లక్షలు వేస్తామన్న హామీల అమలుకు కూడా ప్రజలు ఐక్యమై పోరాడాలన్నారు. కేంద్ర హోంశాఖ మంత్రి పోలీసులను ఉసిగొల్పి లాటి చార్జి చేయించి ఉద్యమాన్ని అణచివేయాలని ప్రయత్నించారని బాధ్యుడైన ఆయన రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ లేవైనా పాలకులు ఎవరైనా ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తే గుణపాఠం తప్పదని గ్రహించాలన్నారు. బిజెపి పోరాట స్ఫూర్తితో దేశంలో రాష్ట్రంలో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజలు విద్యార్థులు యువకులు ఉద్యమించాలని కోరారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళావతమ్మ, జయమ్మ, పృధ్వి నాదం, చిన్న కుర్మయ్య, గోపాలకృష్ణ, శేఖర్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

# రైతు బజార్‌లో రైతులపై అక్రమ వసూళ్ల మోత




**పంట అమ్మాలంటే బస్తాకు 30 నుండి 50 రూపాయల చెల్లింపులా?**

**వసూళ్లు నిలిపివేయాలని కమిషనర్ కు వినతి పత్రం డిమాండ్**

**తొలిసమయం, కొత్తగూడెం, జూలై 25 :**

రైతు బజార్‌లో రైతుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారంటూ రైతులు శనివారం ఆందోళనకు దిగారు. ప్రభుత్వం రైతులు తమ పంటలను నేరుగా వినియోగదారులకు విక్రయించేందుకు ఏర్పాటు చేసిన రైతు బజార్‌లోనే అదనపు వసూళ్లు జరుగుతున్నాయని వారు ఆరోపించారు.కొత్తగూడెం మున్సిపాలిటీ నగరపాలక సంస్థగా మారి ఏడాది దాటినా, ఇప్పటికీ కొందరు వ్యక్తులు పురపాలక సంఘం పేరుతో రైతుల నుంచి బస్తాకు రూ.30 నుంచి రూ.50 వరకు వసూలు చేస్తున్నారని రైతులు తెలిపారు. ఇటీవల డైలీ మార్కెట్ నిర్వహణ హక్కులు పొందిన కాంట్రాక్టర్లు, మార్కెట్ నిర్వహణ పేరుతో వ్యాపారులతో పాటు రైతుల వద్ద కూడా ఈ వసూళ్లు చేస్తున్నారని ఆరోపించారు.ఇప్పటికే గిట్టుబాటు ధరలు లేకపోవడం, కూలీల కొరత, రవాణా ఖర్చులు పెరగడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు ఈ అదనపు భారం మరింత ఇబ్బందిగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు బజార్‌లో రైతుల నుంచి ఎలాంటి రుసుములు వసూలు




చేయకూడదన్న ప్రభుత్వ ఉద్దేశానికి విరుద్ధంగా ఈ వసూళ్లు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో చుట్టుపక్కల మండలాల నుంచి వచ్చిన రైతులు రైతు బజార్ వద్ద నిరసన చేపట్టి, అనంతరం కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్ సుజాతకు వినతిపత్రం సమర్పించారు. రైతుల నుంచి జరుగుతున్న అక్రమ వసూళ్లను వెంటనే నిలిపివేసి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, రైతు బజార్‌లో ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

# కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా దేశ విద్యార్థుల ఘనవిజయం

**- తెలంగాణ ఎస్సీ విద్యార్థి సంఘం...**

**- రాష్ట్ర ఉపాధ్యక్షులు పంతం విజయేందర్-**

**వెలిశాల శ్యామ్**

**తొలి సమయం-దంతాలపల్లి జూలై25**

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నీట్ పేపర్ లీకేజీ తో వేలాదిమంది నీట్ విద్యార్థుల జీవితాలను ఆగం చేసి కొంతమంది విద్యార్థుల ఆత్మహత్యలకు కారణం అయిందని తెలంగాణ ఎస్సీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పంతం విజయేందర్ రాష్ట్ర కార్యదర్శి వెలిశాల శ్యామ్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడద్దని దేశవ్యాప్తంగా విద్యార్థులు పెద్ద ఎత్తున ఢిల్లీలో ఆందోళన చేసి ఢిల్లీ బిజెపి ప్రభుత్వం మెడలు వంచి కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేసే వరకు విద్యార్థి సంఘాల పోరాటం చాలా గొప్పదని అభినందించారు.కేంద్ర ప్రభుత్వం ఎన్ని కుట్రలు పన్నిన పది రోజులుగా యువకులు ,విద్యార్థులు,ప్రతిపక్ష రాజకీయ పార్టీలు ,ప్రజా సంఘాలు ,కుల సంఘాలు ,అన్ని ఒక్కటై ఏక గొంతుగాపోరాటం చేస్తుంటే ఎన్నో నిర్బంధాలు విధిస్తూ



లాఠీచార్జ్ చేసిన విద్యార్థులు ఢిల్లీలో నిరంతరం ఆందోళన కార్యక్రమాలు చేయడం ద్వారానే నేడు బిజెపి ప్రభుత్వం గత్యంతరం లేక విద్యాశాఖ మంత్రితో రాజీనామా చేపించిందని ఇది విద్యార్థుల ఘనవిజయమని ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్నటువంటి పరీక్షలకు లీకేజీ కాకుండా చూసుకొని విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడకుండా ఉండాలని కోరారు. విద్యార్థులతో పెట్టుకుంటే ఏ ప్రభుత్వమైనా పతనమవుతుందని ఈ సందర్భంగా హెచ్చరించారు.

# చెంచువాడ ఎంపీపీఎస్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎంఈఓ

**- ఎఫ్ఎల్ఎన్ పరీక్షా విధానాన్ని పరిశీలించిన మండల విద్యాధికారి**

**తొలి సమయం పెబ్బేరు జూలై 25**

పెబ్బేరు మండల పరిధిలోని ఎంపీపీస్ పెబ్బేరు చెంచువాడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను మండల విద్యాధికారి శ్రీ ఎస్. జయరాములు గారు,ఆకస్మికంగా సందర్శించి పాఠశాల నిర్వహణను క్షుణ్ణంగా పరిశీలించారు.ప్రార్ధన సమయానికి హాజరు అయ్యి.. ప్రార్ధనలో విద్యార్థుల హాజరు, విద్యార్థుల ఆక్టివిటీస్ ని పరిశీలించారు.ఈ సందర్భంగా ప్రధానంగా ఎఫ్.ఎల్.ఎన్. (ఫౌండేషనల్ లీటరసీ అండ్ న్యూమ్రేసీ ) పరీక్షా విధానాన్ని పరిశీలించారు. విద్యార్థుల అభ్యాస స్థాయిని అంచనా వేసేవిధానం,ఉపాధ్యాయులు అనుసరిస్తున్న బోధనా పద్ధతులు, మూల్యాంకన ప్రక్రియపై ఆరా తీసి తగిన సూచనలు చేశారు.అనంతరం నాలుగో తరగతి విద్యార్థుల ఆంగ్ల భాషా నైపుణ్యాలను ప్రత్యక్షంగా పరీక్షించి, వారి చదవడం, రాయడం, అర్థం చేసుకునే సామర్థ్యాన్నిపరిశీలించారు. అలాగే పాఠశాలలోని ప్రీ-ప్రైమరీ తరగతులను సందర్శించి చిన్నారులకు అందిస్తున్న విద్యా బోధన, అభ్యాస వాతావరణాన్ని పరిశీలించారు.మధ్యాహ్న భోజన పథకం అమలు, భోజన నాణ్యత, పరిశుభ్రత,



నిర్వహణను పరిశీలించారు. అదేవిధంగా ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్, విద్యార్థుల హాజరు పట్టికలు మరియు ఇతర పాఠశాల రికార్డులను తనిఖీ చేశారు.విద్యార్థుల హాజరు, క్రమశిక్షణ, పాఠశాల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేసిన మండలవిద్యాధికారి, ప్రతి విద్యార్థి ప్రాథమిక చదవడం, రాయడం, గణిత నైపుణ్యాల అభివృద్ధికి ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. నాణ్యమైన విద్య అందించేందుకు నిరంతరం కృషి చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు డి చిన్నరాములు గారు, ఉపాధ్యాయులు స్వాతి గారు,మాధురి గారు,రాధా గారు, ప్రీ ప్రైమరీ ఇన్స్ట్రక్టర్ కృష్ణవేణి గారు, పుష్పవతి గారు పాల్గొన్నారు.

# ఫ్రైడే డ్రై డే కార్యక్రమం హ్యాండ్‌బోర్ మరమ్మతులు, పారిశుద్ధ్య పనులు



**తొలి సమయం, ఇల్లందు;జులై, 25:**

ఇల్లందు మండలం ఇందిరానగర్ గ్రామపంచాయతీలో సర్పంచ్ పాయం లలిత అధ్యక్షతన పలు అభివృద్ధి, పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా 9వ వార్డులో హ్యాండ్ బోర్‌కు మరమ్మతులు చేపట్టడంతో పాటు 7, 8, 9 వార్డుల్లో చెత్త, పిచ్చి మొక్కలను తొలగించి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జీపీ సెక్రటరీ కె. మహేష్, ఉప సర్పంచ్ బి. ఆదిత్య, వార్డు సభ్యులు బి.ఎన్. సుదర్శన్, యూకే. చుక్కమ్మ, హెల్త్ సిబ్బంది రాధా, బి. భారతి, పి. పార్వతి, బోర్ మెకానిక్ నరసింహారావు, మల్టీపర్పస్ వర్కర్లు యాకూబ్, కాశి, ఉపేందర్ పాల్గొని కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించారు. గ్రామంలో పరిశుభ్రత, తాగునీటి సౌకర్యాల మెరుగుదల కోసం ప్రజల సహకారంతో ఇలాంటి కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని గ్రామపంచాయతీ ప్రతినిధులు తెలిపారు.

# నీట్ విద్యార్థులకు సంఘీభావంగా బీఆర్ఎస్ నిరసన: గిన్నారపు రాజేష్



**తొలి సమయం, ఇల్లందు;జులై,25:**

ఇల్లందు పట్టణంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టి. రామారావు (కేటీఆర్) 50వ జన్మదినం సందర్భంగా నీట్ విద్యార్థులకు సంఘీభావం తెలుపుతూ బీఆర్ఎస్ నాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ నాయక్ ఆదేశాల మేరకు జిల్లా సీనియర్ నాయకుడు సిలివేరి సత్యనారాయణ ఆధ్వర్యంలో జె.కె. కాలనీలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు.ఈ సందర్భంగా సిలివేరి సత్యనారాయణ, మాజీ వైస్ ఎంపీపీ దాస్యం ప్రమోద్, యువజన నాయకుడు గిన్నారపు రాజేష్ మాట్లాడుతూ ఢిల్లీలో నీట్ పరీక్ష వ్యవహారంపై శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసుల లాఠీచార్జ్ చేయడం అప్రజాస్వామికమని విమర్శించారు. విద్యార్థుల పోరాటానికి సంఘీభావంగా కేటీఆర్ తన జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించవద్దని పార్టీ శ్రేణులకు పిలుపునివ్వడం ఆదర్శనీయమని పేర్కొన్నారు.అనంతరం బీఆర్ఎస్ ఇల్లందు నియోజకవర్గ కార్యాలయంలో కేటీఆర్ జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, మహిళా, యువజన విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కేతిరెడ్డి జనార్దన్ రెడ్డి ప్రథమ వర్ధంతిలో పాల్గొనిన ఎమ్మెల్యే




**తొలి సమయం-తొర్రూరు జులై 25**

కాంగ్రెస్ పార్టీ నాయకుడు కేతిరెడ్డి నరేష్ రెడ్డి తండ్రి పికేతిరెడ్డి జనార్దన్ రెడ్డి ప్రథమ వర్ధంతి కార్యక్రమం తొర్రూరు పట్టణ కేంద్రంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి శాసన సభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి పాల్గొన్నారు. దివంగతుని చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘన నివాళులర్పించారు. అనంతరం నరేష్ రెడ్డి, కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. దివంగతుని ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు, పార్టీ సీనియర్ నాయకులు, యువజన నాయకులు, వార్డు కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

# పేదల సోంతింటి కళకు మరో అడుగు

**గుమ్మడంలో బేస్మెంట్ ప్రొసీడింగ్‌ల పంపిణి**



**తొలి సమయం పెబ్బేరు జూలై 25**

గుమ్మడం గ్రామంలో బేస్మెట్ సంబందిచిన లబ్ధిదారులకు ఎంపీడీఓ బి. వెంకటేస్ గారిచే ప్రొసీడింగ్ కాపీలను ఇవ్వడం జరిగింది. గ్రామ సర్పంచ్ పుట్ట నగేష్ సెక్రటరీ నాగ రాజు హౌసింగ్ ఏఈ రాజు రెడ్డి గ్రామ అధ్యక్షులు జల్లి సుధా కర్ నిరంజన్ రెడ్డి రాఘవేంద్ర చారి హరీకుమార్ రెడ్డి చిన్న రాముడు రాజు దశరత్ మల్లికార్జున్ వెంకటేశ్వర్లు చెన్నయ్య పాల్గొన్నారు.

# ప్యాలియేటివ్ కేర్ సిబ్బందికి పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలి

**- జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు హుస్సేన్ నాయక్‌కు వినతి**



**తొలి సమయం మహబూబాబాద్ జూలై 25**

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ప్యాలియేటివ్ కేర్‌లో విధులు నిర్వహిస్తున్న సుమారు 60 మంది ఆయాలకు గత 10 నెలలుగా వేతనాలు చెల్లించకపోవడం వల్ల తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, తమ పిల్లల విద్యా ఫీజులు కూడా చెల్లించలేని పరిస్థితి నెలకొన్నదని ప్యాలియేటివ్ కేర్ ఆయాలు భూక్యా రాజేశ్వరి, ధరావత్ లక్ష్మీ, సంధ్య జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు హుస్సేన్ నాయక్ గారిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగుల సంఘాల ఐకాస రాష్ట్ర నాయకులు డాక్టర్ కుమార్ నాయక్ & బాలాజీ చౌహాన్ , మాట్లాడుతూ ప్రభుత్వం జీవో నెం.1187, 1190, 1195లను వెంటనే అమలు చేయాలని కోరారు. ఈ జీవోలు అమలైతే రాష్ట్రంలోని సుమారు 4,500 మంది ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు నాలుగున్నర సంవత్సరాల 30% పీఆర్‌సీ బకాయిలు అందడంతో పాటు, ఇప్పటివరకు 30% పీఆర్‌సీ ప్రయోజనం పొందని ఉద్యోగులందరికీ న్యాయం జరుగుతుందని తెలిపారు. ఈ అంశంపై ఉద్యోగులు న్యాయస్థానాన్ని ఆశ్రయించగా, కోర్టు జీవోలను అమలు చేయాలని ఆదేశించినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడంతో ధిక్కార పిటిషన్లు కూడా దాఖలయ్యాయని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం కోర్టు ఆదేశాలను గౌరవించి జీవోలను అమలు చేయాలని కోరారు.అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర ఫిజియోథెరపిస్టుల యూనియన్ అధ్యక్షుడు డాక్టర్ కందుల నాగరాజు మాట్లాడుతూ, రాష్ట్రంలోని ప్రతి జిల్లా ఆసుపత్రిలో ప్రత్యేక ఫిజియోథెరపీ విభాగాలను ఏర్పాటు చేసి, ఖాళీగా ఉన్న ఫిజియోథెరపిస్టుల పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.అలాగే జాతీయ అలైడ్ మరియు హెల్త్‌కేర్ ప్రొఫెషనల్స్ చట్టం2021 ( 2021) ప్రకారం ప్రతి రాష్ట్రంలో స్టేట్ అలైడ్ అండ్ హెల్త్‌కేర్ ప్రొఫెషనల్స్ కౌన్సిల్ ఏర్పాటు చేయడం తప్పనిసరి అయినప్పటికీ, తెలంగాణలో ఇప్పటివరకు కౌన్సిల్‌ను ఏర్పాటు చేయకపోవడంతో పాటు ఛైర్మన్‌ను కూడా నియమించలేదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కౌన్సిల్‌ను ఏర్పాటు చేసి, అలైడ్ హెల్త్‌కేర్ వృత్తి నిపుణుల సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు హుస్సేన్ నాయక్ సానుకూలంగా పరిశీలించి ప్రభుత్వ ఆసుపత్రిలో ఫిజియోథెరపీ డిపార్ట్మెంట్ ఆవశ్యకత చాలా అవసరమని సమస్యలను సంబంధిత అధికారులతో చర్చించి ఉద్యోగులందరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# మరిపెడలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ఆకస్మిక తనిఖీలు

**ఎస్ ఐ ఆర్ డిజిటలైజేషన్ ప్రక్రియ పరిశీలన**

**సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో**

**విద్యా, వసతి సౌకర్యాలపై ఆరా**

**తొలి సమయంమహబూబాబాద్/, మరిపెడ: జూలై 25**

మహబూబాబాద్ జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ స్నేహ శబరిష్ మరిపెడ మండల కేంద్రంలో ఆకస్మికంగా పర్యటించి ఎస్ ఐ ఆర్ సవరణ డిజిటలైజేషన్ కార్యక్రమంతో పాటు సాంఘిక సంక్షేమ శాఖ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల, వసతి గృహం (నరసింహులపేట)లను తనిఖీ చేశారు. కార్యక్రమాల నిర్వహణ తీరును క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.ముందుగా మండల కేంద్రంలో కొనసాగుతున్న ఎస్ ఐ ఆర్ సవరణ డిజిటలైజేషన్ ప్రక్రియను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ఇంటింటికి పంపిణీ చేసిన ఎన్యూమరేషన్ ఫారాల వివరాలు, ఇంకా బీఎల్‌ఓలకు తిరిగి అందని ఫారాల పరిస్థితిపై అధికారులను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. ప్రతి కుటుంబానికి వెళ్లి ఖచ్చితమైన సమాచారాన్ని సేకరించి, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా డిజిటలైజేషన్ పూర్తి చేయాలని ఆదేశించారు.రాజకీయ పార్టీల ప్రతినిధులు, బీఎల్‌ఓలు, సూపర్వైజర్లు, సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి ఆగస్టు 3లోగా అన్ని ఫారాలను పూర్తి చేసి సమర్పించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఓటరు జాబితా సవరణలో పారదర్శకత, ఖచ్చితత్వానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.అనంతరం కలెక్టర్ మరిపెడ మండల పరిధిలోని



నరసింహులపేట సాంఘిక సంక్షేమ శాఖ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల, వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థినులతో ఆత్మీయంగా మాట్లాడారు. తరగతి గదులు, వసతి గృహం, కిచెన్ షెడ్, డైనింగ్ హాల్, మరుగుదొడ్లు, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న విద్యా సౌకర్యాలు, భోజన నాణ్యత, డైట్ మెనూ అమలు, వసతి ఏర్పాట్లపై ఆరా తీశారు.ప్రభుత్వం నిర్దేశించిన డైట్ మెనూను తప్పనిసరిగా అమలు చేయాలని, విద్యార్థులకు పోషకాహారం అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రతి సబ్జెక్టులో విద్యార్థులకు పూర్తి అవగాహన కల్పించేలా బోధన ఉండాలని, ముఖ్యంగా ఇంగ్లీష్ భాషా నైపుణ్యాల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఉపాధ్యాయుల హాజరు శాతం కచ్చితంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.విద్యార్థుల్లో విద్య, ఆరోగ్యం, పరిశుభ్రత, పోషకాహారం అంశాలపై అవగాహన పెంపొందించే కార్యక్రమాలు నిరంతరం నిర్వహించాలని చెప్పారు. విద్యార్థినులు, భోజనం తయారు చేసే సిబ్బందికి షెడ్యూల్ ప్రకారం వైద్య పరీక్షలు నిర్వహించాలని, బాలికల ఆరోగ్య పరి స్థితి, మానసిక స్థితిగతులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిం చాలని ఉపాధ్యాయులు, వార్డెన్లకు సూచించారు. పాఠశాల లేదా వసతి గృహ నిర్వహణలో ఎలాంటి సమస్యలు ఉన్నా ఆలస్యం చేయకుండా వెంటనే జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకురావాలని



అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు సురక్షితమైన, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# పంట మార్పిడితోనే రైతులకు, సమాజానికి మేలు: జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్



**తొలి సమయంమహబూబాబాద్/మరిపెడ, జూలై25:**

మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం ఎడ్జెర్ల గ్రామానికి చెందిన గిరిజన రైతు బాదావత్ వీరన్నబుజ్జి దంపతుల పొలంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ పెసర విత్తనాలు వేసి పంట మార్పిడి విధానాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు మారుతున్న వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని నీటి వినియోగం తక్కువగా ఉండే ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు.వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల్లో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి శాస్త్రీయ పద్ధతుల్లో సాగుకు అవసరమైన సలహాలు అందించాలని ఆదేశించారు.వాతావరణ మార్పులు, అకాల వర్షాలు , సూపర్ ఎల్-నినో వల్ల ఏర్పడే వర్షాభావ పరిస్థితులను తట్టుకోవడానికి రైతులందరూ పంట మార్పిడి పద్ధతులను పాటించాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.కేవలం వరి, మొక్కజొన్నలకే పరిమితం కాకుండా పప్పు దినుసులు, నూనె గింజలు కుసుమ,ఆయిల్ పామ్, నువ్వులు, కూరగాయల సాగుపై దృష్టి సారించాలి. ప్రతి రైతు తమ భూమిని భాగాలుగా చేసి వివిధ రకాల ప్రత్యామ్నాయ పంటలు పండించాలన్నారు. జిల్లాలో నూతన ప్రాజెక్ట్ ద్వారా ప్రతి గ్రామంలో అన్ని రకాల పోషకాహార పంటలు పండేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. (ఉపాధి హామీ) పథకంలోని యానిమల్ హెల్త్ క్లినిక్స్ సౌకర్యాన్ని ఉపయోగించి, కుక్కల మాదిరిగానే కోతులకు కూడా స్టెరిలైజేషన్ చేసే ప్రతిపాదనను పరిశీలిస్తున్నామని అన్నారు. అధిక యూరియా, పురుగుమందుల వాడకం వల్ల ఆహారంలో పోషకాలు తగ్గి పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలపై తీవ్ర



ప్రభావం చూపుతోందని. రైతులు సామాజిక బాధ్యతతో ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రీయ/ఆరోగ్యకరమైన పంటలను పండించాలి. తక్కువ రసాయనాలు వాడే రైతుల ఉత్పత్తులకు నగరాల్లో మంచి మార్కెటింగ్ కల్పిస్తామని అన్నారు.అవసరం లేని పంటలను ప్రభుత్వం కొనుగోలు చేయడానికి వేల కోట్లు వెచ్చించే బదులు, ఆ నిధులతో గ్రామీణ ప్రాంతాల్లో ఇరిగేషన్ ప్రాజెక్టులు, మంచి పాఠశాలలు, కళాశాలలు నిర్మించుకోవచ్చని కలెక్టర్ అన్నారు.రైతులు మారుతున్న కాలానికి అనుగుణంగా ఆలోచించి, ప్రభుత్వానికి సహకరిస్తూ లాభసాటి వ్యవసాయం వైపు అడుగులు వేయాలని కలెక్టర్ కోరారు.పంట మార్పిడి అవగాహన కార్యక్రమంలో భాగంగా భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి- భారతీయ ఉద్యాన పరిశోధన స్థానం, బెంగళూరు వారిచే రూపొందించబడిన నల్ల తామర పురుగులు తట్టుకునే అర్క తేజస్వి రకం విత్తనాలను రైతులకు జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ చేతి మీద పంపిణీ కార్యక్రమం ప్రారంభించడం జరిగింది. మధ్య తెలంగాణ మండలి జిల్లాలకు సంబంధించి మిరప సాగు గురించి పరిశోధనలు జరుపుతున్న ఉద్యాన పరిశోధన స్థానం, మల్యాల వారిచే ఈ రకాన్ని 2022 సంవత్సరం నుండి రైతుల క్షేత్రాలు లో సాగు చేయించి ఎకరానికి 40 క్వింటాల్ వరకు మిరప దిగుబడి సాధించడం జరిగింది. 2026 సంవత్సరంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో 250 ఎకరాలలో ఈ రకం విత్తనాన్ని రైతులకు పంపిణీ చేయడం జరుగుతుంది. ఈ విత్తనాల పంపిణీ ప్రారంభ కార్యక్రమంలో డా.ప్రశాంత్ ప్రధాన శాస్త్రవేత్త, హెచ్ ఆర్ ఎస్ మల్యాల వారు పాల్గొన్నారుఈ కార్యక్రమంలో మరిపెడ మున్సిపల్ చైర్ పర్సన్ వీసారపు ప్రగతి రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి విజయ్



చంద్ర, జిల్లా ఉద్యానవన మరియు పట్టు పరిశ్రమ శాఖ అధికారి జినుగు మరియన్న, మరిపెడ వ్యవసాయ సహాయ సంచాలకులు మురళి, మున్సిపల్ కమిషనర్ నరేష్ రెడ్డి, ఉద్యాన పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఏ ప్రశాంత్ , కృషి విజ్ఞాన కేంద్రం మల్యాల ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ దిలీప్, ఉద్యాన శాస్త్రవేత్త ఎల్ సుహాసిని, వ్యవసాయ అధికారులు వీరా సింగ్, శ్రీదేవి, వ్యవసాయ విస్తరణ అధికారులు, సర్పంచ్ లచ్చుపతి, మరిపెడ మున్సిపల్ వైస్ చైర్మన్, మండల అభివృద్ధి అధికారి, తాసిల్దార్, ఇరిగేషన్ అధికారులు, విద్యుత్ అధికారులు,ఉద్యాన అధికారులు శాంతిప్రియ, తదితరులు పాల్గొన్నారు.